క్లుప్తంగా

పల్లెకోనలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం



పల్లెకోన(భట్టిప్రోలు): సోషల్ మీడియా వైఎస్సార్‌సీపీకి కొండంత బలమని వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలంలోని పల్లెకోనలో మంగళవారం వేమూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సోషల్ మీడియా ఆత్మీయ సమావేశంలో అశోక్‌బాబు మాట్లాడారు. సోషల్ మీడియా సైన్యం పార్టీకి అండ దండలు అందించడమే కాక తమపై ఎన్నో కేసులు పెట్టినా భయపడకుండా నిలబడటం సాధారణ విషయం కాదన్నారు. వైఎస్సార్‌సీపీ రాజకీయాలలో సోషల్ మీడియా ఒక భాగమని తెలిపారు. సోషల్ మీడియాకు వేమూరు నియోజకవర్గంలో మంచి గుర్తింపు ఉండేలా చూడటమే తన తక్షణ కర్తవ్యమన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి తెలియజేసేందుకు సోషల్ మీడియా ఎంతగానో దోహదపడుతుందన్నారు. బౌడ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడు వైఎస్ జగన్ మరొక అడుగు ముందుకు వేసి సంక్షేమ పథకాలకు కొత్త భాష్యం చెప్పారన్నారు. పేదల కోసం వైఎస్సార్ పడే తపన ఆయన తనయుడిలో చూస్తున్నామని అన్నారు.

నేతాజీకి ఘన నివాళి



భట్టిప్రోలు: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం భట్టిప్రోలులోని మినీ ట్యాంక్ బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆ మహనీయుని సేవలను స్మరించుకుంటూ పలువురు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వివేకానంద విగ్రహ సాధన కమిటీ నిర్వాహకులు బండారు శ్రీనివాసరావు, ఎం.లీలామోహన్‌రావు, ఆర్ సత్యన్నారాయణమూర్తి, సీహెచ్‌వీ ఉమా మహేశ్వరరావు, కటకం సాంబశివరావు, జి.మల్లిఖార్జునరావు, కె. చిదంబరరావు, సీహెచ్ రాజేష్, రఘు, టి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



రేపల్లె రూరల్: అగ్నిప్రమాద బాధితులకు చేయూత నివ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని ఉప్పూడి కాల్వకట్టపై నివాసం ఉంటున్న ఎస్టీల పూరిళ్లు ఇటీవల అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో పలువురు దాతలు బాధితులకు మంగళవారం చేయూతనందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ వంటసామాగ్రితో పాటు ప్రభుత్వం నుంచి వచ్చిన నిత్యావసర వస్తువులను అందజేశారు. స్వచ్ఛంద సేవా సంస్థలు సైతం బాధితులకు చేయూతనివ్వాలని కోరారు. 13వ వార్డు మాజీ కౌన్సిలర్ చెన్ను లక్ష్మణరావు ఒక్కొక్క బాధిత కుటుంబానికి రూ.5 వేల చొప్పున మొత్తం 5 కుటుంబాలకు రూ.25వేల సాయం అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు ఆటంకం

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వేటపాలెం, తోటపాలెం, కొత్తపల్లి, నారికేళపల్లి గ్రామాలలో బుధవారం విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఏఈ అర్జునరావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు ఈ మార్పును గమనించాలని కోరారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పల్లెకోన ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ పి.ఏడుకొండలు మంగళవారం తెలిపారు. మండలంలోని వేమవరం దగ్గర నుంచి సూరేపల్లి, కోనేటిపురం, పల్లెకోన వరకు ఉన్న గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఐలవరం ఫీడర్ పరిధిలో నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు మార్పును గమనించాలని కోరారు.

రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు

బాపట్ల: రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు పేర్కొన్నారు.35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా బాపట్ల మున్సిపాల్టీ పరిధిలోని వాలంటీర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. పోలీసుల నిబంధనల ప్రకారం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కిరణ్, ఇన్‌స్పెక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అర్చన

బాపట్ల: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో దివ్యాంగులకు ఆర్థిక సాయం అందించేందుకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చన మాట్లాడుతూ దివ్యాంగులకు జీవనోపాధి నిమిత్తం జాతీయ వికలాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా రుణాలను ఇప్పించటం జరుగుతుందని తెలిపారు.

డ్రైవర్ల అప్రమత్తతతో రోడ్డు ప్రమాదాల నివారణ

- తెనాలి డివిజన్ ఆర్టీఓ ప్రసాద్
- ఘనంగా 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు



విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్టీఓ ప్రసాద్, తదితరులు

చేబ్రోలు: రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నా, ప్రయాణికులను సుఖంగా, భద్రంగా గమ్యం చేర్చాలన్నా డ్రైవర్ల అప్రమత్తతోనే సాధ్యమవుతుందని తెనాలి డివిజన్ ఆర్టీఓ ప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మంగళవారం 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ ప్రసాద్ మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నేరాలను చేయకూడదన్నారు. విద్యా సంస్థలలో పనిచేసే డ్రైవర్లు మరింత అప్రమత్తతతో పాటు పరిమితికి మించి విద్యార్థులను బస్సు లోపలికి అనుమతించరాదన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూగానీ, అధిక వేగంతోగానీ బస్సులను నడుపరాదని హెచ్చరించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డ్రైవర్లందరూ మెడికల్ చెకప్ చేయించుకోవాలని సూచించారు. ప్రాణం ఎంతో విలువైనదని, ఏ ఒక్కరూ కూడా రోడ్డు ప్రమాదాల్లో మరణించకూడదనే ఉద్దేశ్యంతో డ్రైవర్లకు అవగాహన కల్పించే విధంగా భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. బస్సుల్లో ప్రాథమిక చికిత్సకు సంబంధించిన కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బస్సు రన్నింగ్‌లో ఉన్నప్పుడు విద్యార్థులను ఎక్కడానికి, దిగడానికి అనుమతించుకూడదని తెలిపారు. ప్రతి ఒక్క డ్రైవర్ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలకు సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. తెనాలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రాఘవరావు, ఎస్‌బీ మధుసూదన్‌రావు, జిల్లా రోడ్ సేఫ్టీ మేనేజర్ షేక్ సాదిక్, రోడ్ సేఫ్టీ డ్రైవింగ్ ట్రైనర్ జగదీష్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

'ఆర్‌వీఆర్'లో కొలరిడో పోస్టర్ ఆవిష్కరణ



కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: విద్యార్థుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషిచేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో రెండు రోజులపాటు కొలరిడో పేరుతో జరగనున్న జాతీయస్థాయి పోటీల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాతీయస్థాయి పోటీలు ఫిబ్రవరి 15–16 తేదీలలో జరుగుతాయన్నారు. కళాశాల ఆవరణలో జరిగే ఈ పోటీలలో విజేతలకు రూ.5 లక్షల వరకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లను అందించటం జరుగుతుందన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ టెక్నికల్, సాంస్కృతికం, క్రీడల విభాగాలలో పోటీలు నిర్వహించటం జరుగుతుందన్నారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ పోటీల్లో దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో వివిధ కళాశాలల విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పోటీలకు సంబంధించిన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి కళాశాలకు చెందిన https://rvrjcce.ac.in/colorido2k24 వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, కార్యక్రమ కన్వీనర్ పోన్నం కిషోర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ మమత

పెదకాకాని: గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని లక్షణాలు గుర్తించిన వెంటనే తగిన పరీక్షలు, చికిత్స చేయించుకుని ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని ఆస్టర్ రమేష్ హాస్పటల్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు, అధ్యాపకులు నిర్వహించిన గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన సదస్సుకు డాక్టర్ మమత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రాయపాటి మమత మాట్లాడుతూ గుండెకు రక్త సరఫరా పూర్తిగా అందకపోవడం వలన స్ట్రోక్స్ సంభవిస్తాయని, స్ట్రోక్స్ అన్ని వయసుల వారికి సంభవించవచ్చన్నారు. వాటి లక్షణాల పై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. బలహీనత, తీవ్రమైన తలనొప్పి, నడకలో ఇబ్బంది వంటి లక్షణాలు గమనించిన వెంటనే వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. ఆస్టర్ రమేష్ హాస్పటల్‌లో పూర్తిస్థాయిలో గుండె పనితీరును అంచనా వేయగల ఆధునిక రోగనిర్ధారణ పరీక్ష పరికరాలు, సీటీసీఐజీ వంటివి అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ పి.మహ్మద్‌ఖాన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌డీ పత్తి సాగుపై దృష్టి పెట్టండి

డీడీఏ రామాంజనేయులు



పంట పొలాలను పరిశీలిస్తున్న రిసోర్స్ సెంటర్ డీడీఏ రామాంజనేయులు

ప్రత్తిపాడు: హెచ్‌డీ పత్తి సాగుపై రైతులు దృష్టి సారించాలని డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ డీడీఏ రామాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడులో మంగళవారం గ్రామ విత్తన పథకం కింద రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద మండలంలోని గొట్టిపాడు, వంగిపురం రైతులకు ఈ ఏడాది సీజన్ ఆరంభంలో రైతులకు ప్యూరిటీ విత్తనాలను అందజేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత రైతులకు శిక్షణనిచ్చారు. పంట సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన సస్యరక్షణ పద్ధతులు, అవలంబించాల్సిన విధానాలపై రైతులకు వివరించారు. రైతులు హెచ్‌డీ కాటన్ సాగుపై ఆలోచించాలన్నారు. ఈ రకం సాగు వలన రెండు తీతల్లోనే దిగుబడి చేతికి వస్తుందని, మామూలు రకాల వలన మూడు పత్తి తీతలు పడుతున్నాయని, దీని వలన ప్రకృతి విపత్తుల సమయంలో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఏఓ రాజవంశి, ఏరువాక శాస్త్రవేత్త ఎం.నగేష్, ఏఓ అరుణకుమారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బీమా పాలసీలను వినియోగించుకోవాలి

పోస్టల్ శాఖ ఏపీ సర్కిల్ హెడ్ ఎస్.ప్రకాజ్ శివమణి

ప్రత్తిపాడు: పోస్టల్ బీమా పాలసీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ శాఖ ఏపీ సర్కిల్ హెడ్ ఎస్.ప్రకాజ్ శివమణి తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన బత్తుల రాజశేఖర్ కొద్ది నెలల కిందట విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. రాజశేఖర్ పోస్టల్ శాఖకు చెందిన రూ.399లతో గ్యాగ్ పాలసీని చేయించుకుని ఉన్నాడు. దీంతో పోస్టల్ నిబంధనల ప్రకారం ప్రమాద బీమా కింద మృతుని కుటుంబానికి రూ.10 లక్షలు అందాయి. ఈమేరకు మృతుడి భార్య వాణికి చెక్కును స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పోస్టల్ శాఖ ఏపీ సర్కిల్ హెడ్ ఎస్.ప్రకాజ్ శివమణి అందజేశారు. పోస్టల్ నరసరావుపేట బ్రాంచి మేనేజర్లు మహేష్‌రెడ్డి, శివ, గుంటూరు సౌత్ సబ్ డివిజన్ ఐపీఓ మునిచంద్రారెడ్డి, గొట్టిపాడు బీపీఎం శ్రీహర్ష పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



పిట్టలవానిపాలెం: సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నెరవేర్చారని వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కూసంపూడి దేవేంద్రరాజు అన్నారు. మండలంలోని ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం గ్రామాలలో మంగళవారం డ్వాక్రా మహిళలతో కలిసి సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని ఇచ్చిన హామీని సీఎం జగన్ నెరవేర్చటం అభినందనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చేబ్రోలు కృపానందం, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసన్నరాజు, సీతయ్య, సుబ్బారావు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయ కర్త వరికూటి అశోక్‌బాబు ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నట్లు ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఉదయం పాఠశాలలో జరిగే కార్యక్రమంలో ట్యాబ్‌ల పంపిణీ ఉంటుందన్నారు.

సెబ్ ఎస్ఐ గీతపై విచారణ



ప్రత్తిపాడు: స్థానిక సెబ్ స్టేషనులో ఎస్ఐ గీతపై వచ్చిన అవినీతి ఆరోపణలపై మంగళవారం ఆశాఖ ఉన్నతాధికారులు విచారణ నిర్వహించారు. గత ఏడాది అక్రమ మద్యం కేసులో ప్రత్తిపాడుకు చెందిన యర్రాకుల భాస్కర్ అనే వ్యక్తి నుంచి రూ. 30 వేలు లంచం తీసుకోవడంతో పాటు అతనిపై కేసులు నమోదు చేశారు. దీంతో బాధితుడు ఆశాఖ ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీంతో సెబ్ ఏఈఎస్ దుర్గాప్రసాద్ విచారణ జరిపారు. బాధితుడు భాస్కర్‌ను సెబ్ స్టేషనుకు పిలిపించి విచారించి, స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎస్ఐ గీతపై వచ్చిన ఫిర్యాదుపై విచారించేందుకు ఇక్కడకు రావడం జరిగిందని తెలిపారు.

స్టేజిపై నుంచి పడిన యువకుడు మృతి

తెనాలిరూరల్: స్టేజిపై నుంచి పడి తీవ్ర గాయాలపాలైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఇందిరానగర్ కాలనీకి చెందిన సంతోష్(19) తన ఇంటి సమీపంలో నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టేజిపై డ్యాన్స్ చేస్తూ ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. తలకు గాయమైనా ఇంట్లో వారికి చెప్పలేదు.

నాలుగు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యం పాలవడంతో తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కోసం గుంటూరు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. వైద్యశాల నుంచి మంగళవారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీ టౌన్ ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు.

వక్తృత్వ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

చుండూరు(వేమూరు): జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో చుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రత్న శ్రీ ద్వితీయ స్థానం సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి రామారావు తెలిపారు. బాలికా దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా కేంద్రంలోని సరస్వతి స్మారక బాలికల ఉన్నత పాఠశాలలో మంగళ వారం జిల్లా స్థాయి వ్యాస రచన, వక్తృత్వ, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. చుండూరు మండలంలోని చుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రత్న శ్రీ వక్తృత్వ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించడంతో మండల విద్యాశాఖాధికారి అర్ చలపతి రావు, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెనాలి మండలం గుడివాడ గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, సిబ్బంది మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న టి.శ్యాంబాబు నుంచి 12 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

ఐలవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఐలవరం(భట్టిప్రోలు): గ్రామీణ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలకు సైతం వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం రోగులకు ఎంతగానో దోహదపడుతుందని సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం ఐలవరం సచివాలయం–2 పరిధిలో మంగళవారం స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరానికి తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావులు హాజరయ్యారు. వైద్యులు ఎ.శ్రీనివాసరావు, స్పెషలిస్ట్ డాక్టర్లు కె.ప్రదీప్ చంద్ర, ఎస్‌కె జబీర్ బాషా, శామ్యూల్‌పాల్, ప్రదీప్, ఆప్తమాలజిస్ట్ వేము స్వప్నలు పాల్గొని వైద్యసేవలు అందించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి. శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మాచర్ల హేమ సుందరరావు, సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

నాటుసారా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు



బెల్లంఊటను పారబోస్తున్న సిబ్బంది

నిజాంపట్నం: నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని రేపల్లె డీఎస్పీ టి మురళీకృష్ణ హెచ్చరించారు. బాపట్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ పి మహేష్ సూచనలతో రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం నిజాంపట్నం మండలం దిండి పంచాయతీ అదవల గ్రామంలో కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ 62 మంది పోలీస్ సిబ్బందితో తెల్లవారు జామున 4 గంటల నుంచి కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. నాటుసారా తయారుచేసే ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. అదవల గ్రామ శివారులోని మడ అడవుల్లో నాటుసారా తయారు చేసే బట్టీలను గుర్తించి ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 350 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటుసారా తాగడంవల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అడవులదీవి, నగరం,నిజాంపట్నం,చెరుకుపల్లి ఎస్ఐలు వెంకట రవి, రామకృష్ణ, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన



తెనాలిటౌన్: పట్టణ చెంచుపేటలోని గ్రంధి గార్డెన్ ఓపెన్ గ్రౌండ్‌లో చేనేత హస్తకళా మేళా ఆధ్వర్యంలో వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శనలో పోచంపల్లి, మంగళగిరి, ఉప్పాడ, నారాయణపేట్, గద్వాల, ప్రొద్దుటూరు, మాధవరం పట్టు చీరలు, బెంగాలీ చీరలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. వరంగల్ కార్పెట్లు, డోర్ మ్యాట్‌లు పలు రంగుల్లో అబ్బురపరుస్తున్నాయి. మీరట్ బెడ్ షీట్స్, హైదరాబాద్ మంచి ముత్యాలు, సారంగపూర్ ఉడెన్ వేర్, బ్లాక్ మెటల్, వెండి, ఇత్తడి వస్తువులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. తెనాలి చెంచుపేటలో ఈనెల 28 వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని చేనేత హస్తకళా ప్రదర్శన నిర్వాహకులు రాజేష్ తెలిపారు. పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని మురుగు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవటం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 37వ వార్డులో మంగళవారం జరుగుతున్న మురుగు కాల్వల షిల్ట్ పనులను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాల్వలో వ్యర్థాలు వేయటం వలన పారుదల నిలిచిపోతుందని చెప్పారు. దుకాణ యజమానులు, ప్రజలు వ్యర్థాలను కాల్వల్లో వేయవద్దని సూచించారు. ఆమె వెంట ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెబోయిన రాము, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, ప్రసాద్ తదితరులు న్నారు.

ఏపీ చేనేత కార్మిక సంఘ సభ్యునిగా కొడాలి

భట్టిప్రోలు: ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులుగా భట్టిప్రోలుకు చెందిన కొడాలి రామకోటేశ్వరరావు ఎన్నికైనట్లు ఆ సంఘం సహాయ కార్యదర్శి జి.బాలాజీ మంగళవారం తెలిపారు. ఇటీవల గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన రాష్ట్ర 13వ మహా సభల నిర్వహణలో భాగంగా ఈ ఎన్నిక జరిగింది. రామకోటేశ్వరరావు ఎన్నిక పట్ల సంఘం సభ్యులు కె. మోహన్‌రావు, డి. రామారావులు హర్షం వ్యక్తం చేశారు.